



"పార్టీ" అని పేరు పెట్టగానే అనేక అవకతవకలు మనతో చెప్పకుండానే అందులో ప్రవేశించడం పరిపాటి. పార్టీని నిర్మలంగా అట్టే బెడతామంటే పాడవకుండా ఉండే పదార్థం కాదని. నా బ్రతుకులో ఎన్ని పార్టీలో చూచాను. వాటిల్లో కశ్మలం ఎలా పేరుకుంటూ వచ్చిందో చూచాను. ఏంలాభం? నోరు పెట్టుకు బ్రతికే జీవులు, మోసంతో జయించే క్రిములు, వానిలో ప్రవేశించడం, అవి కొద్దిరోజులకే కంపు కొట్టడం... వానికధిష్ఠాన దేవతలనబడేవారు ఎలాగైనా పార్టీని బ్రతికించాలని, నిజరోగాన్ని గుర్తించక, గుర్తించినా మందువేయక, అన్య చికిత్సలకోసం అటుమటించడం, చురకలో, కాల్చులో అనవసరపు జాగాలలో వేసి మొదలు ప్రాణానికే ముప్పు తేవడం మనం అనుభవంలో చూస్తున్నాం...

వెంగయ్య రెండుగంటలో మూడుగంటలో ఉపన్యసింప దలచుకున్నాడని తొలిలో కని పెట్టింది వైద్యరాజు. అందుకనే ఆయన "ఓ జిడ్డుగారూ! చికిత్సలు, శల్యతంత్రాలూ వివుర్శించక అనవలసింది సూటిగా అనేయండి" అని కేకవేసేశారు. వారు ప్రసంగింపంలదినది ప్రశస్తమైన డాల్డాజిడ్డు కాబట్టి అభ్యంతరం చెప్పడం అంగీకరింపదగినది కాదంటూ ఓబయ్య ముక్తాయించారు.

వాడికి క్లిష్టంగా చెప్పడం చస్తే చాతకాదు కాబట్టి అభిప్రాయం మనమే పసికట్టేసి కార్యక్రమాన్ని ముందుకు నడిపివేయడం ధర్మం... బావ సూచించాడు.

అందుకొక డ్రైవరు కావాలి కాబట్టి సభాపతిగా మన సభకొకరిని ఇప్పుడే యెంచుకోవడం మంచిది... సంగయ్య అర్థనిమీలిత నేత్రాలతో నాంచారమ్మగారి (వేలాడే పైట కొంగువైపు చూస్తూ అన్నాడు. ఇదివరలో ఏ యెన్నికల లోను పాల్గొనని మేలిమి వ్యక్తి దొరికినపక్షంలో మనమాపనిని భర్తీ చేయవచ్చన్నాడు ఓబయ్య.

మావాళ్లందరూ కనీసం పంచాయతీ యెన్నికలలోనైనా మైలపడ్డవాళ్ళే. ఓబయ్య ఒక్కడే తీరుబడిలేకనో, ఎవరూ ప్రోత్సహించకనో ఇంత వరకు మడిగానే ఉన్నాడు. అయినా మేమేది అనుకుంటే దానికే ఏదో అడ్డుపుల్లవేస్తూంటాడు. నాంచారమ్మ సంగయ్య యుగళం అంటే ఎందుకో అసలే కక్షవాడికి...ఆవిడ ఫొటోలను అల్లరి చేయకుండా ఆల్బం నేనే కాజేసి బీరువాలో ఉంచాను.

సభాపతిగా నాంచారమ్మను ఉంచటం న్యాయం...అన్న సన్నని ధ్వని నెవరో చేశారు. సంగయ్యమాత్రం కాదు. ఆమె గడచిన మ్యునిసిపల్ యెన్నికలలో ప్లీడరుగారికాయనకు ప్రచారం చేసి అపరిశుద్ధి నందింది. ఆ తర్వాతనే మన సంఘంలో అనుగు పెడత...ఆ విషయాన్ని సభ్యులకు జ్ఞాపకం చేసుకుంటున్నాను...ఓబయ్య విసురది. ఆమె సుగుణవతి అని నాకు చాలామంది క్లబ్బుమెంబర్లే కబురిచ్చారు. కాని ఒంటరిగా రెండవఆట సినీమాకే వెళుతూండడ, సినీమా పూర్తికాకముందే ఆ రిజర్వు క్లాసులోనుంచి అదృశ్యం అవుతూకడడం అలవాటు. అట్టి వ్యక్తి మన సంఘాన్ని ముంచుతోందో తేలుస్తుందో ఆలోచించుకో డానికి అరగంట టైమిచ్చి...ఆ పైన ఓటింగుకు పెట్టడం అత్యంత న్యాయం అని విన్నపము... కాషేశం ఘాటుగా అనేశాడు.

నాంచారమ్మ విషయం బావ అధ్యక్షతన

ఓటింగుకు పెట్టి ఓట్లు లెక్కించారు. అనుకూలురు అననుకూలురు సమానంగా తేలారు. సంగయ్య బావకేసి జాలిగా చూచాడు. ఆలోచించాడు.

మిత్రశ్రీలకుమనవి. మనసంఘం బహుముఖాల వర్ధించాలంటే స్త్రీలసహకారం అవసరం. అందుచే నేటినుండి నాంచారమ్మ సౌశీల్యాదికలను గౌరవ సభ్యులు విమర్శించరాదని కట్టడిచేస్తూ ఆమె కనుకూలంగా నా ఓటిచ్చి ఆమెగౌరవాన్ని నెగ్గిస్తున్నాను. తోడ్తోడనే మన సమావేశాలను సక్రమంగా నడుపుతూండమని ఆమెను అధ్యక్షురాలిగా నియమిస్తున్నాను. మనమందరం ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా వేషాలు వేయవలసినవాళ్ళంకాబట్టి యీ శ్రీమతి (శ్రీమతికాదు లేండి అని ఓబయ్యకేక) అనుగుణ పాత్రలను స్వీకరింపగలదని ఆశిస్తున్నాను...అని బావ సీటులోంచి లేచాడు...

నాంచారమ్మ కరతాళములమధ్య ఆసనాన్ని అధిష్ఠించింది. సామాన్యంగా సినిమాలో నాయికానాయకులు దండలు వేసుకొనేటప్పుడు పల్లెటూరి ప్రేక్షకులెంత ఉత్సాహంతో తప్పట్లుకొడతారో అంత ఉత్సాహంతో గౌరవసభ్యులు తప్పట్లు ప్రయోగించారు. ఓబయ్యకు కోపమాగక కాబోలు గట్టిగా మూడుదెబ్బలెకొట్టి విడిచాడు. సంగయ్యకేతన్మయీభావం కలిగిందో అందరూ ఆగినా అతను వాయిస్తూనే ఉన్నాడు.

నాంచారమ్మ యుక్తిమంతురాలు. శత్రువులను ముందు వశపరుచుకోవాలనే రాజనీతి తెలిసినది. ఆ మధ్య వ్యతిరేకులైన మ్యునిసిపల్ నౌకర్లు బీటుకనిస్టేబిలు, ఆమె రెండవ ఆటనుండి తిరిగి వెడుతూండగానే "మీవారెవరో మాకనుమానంగా ఉంది. మీ వివరాలు మాకు ఇవ్వాలి. లేకుంటే స్టేషనుకునడవాలి" అని దబాయించారు. ఆమె నిర్భయంగా "నడవండి స్టేషనుకే వెడదాం. అక్కడే సౌఖ్యంగా ఉంటుంది" అంది. వాళ్ళేమనుకున్నారో ఒకసందుమలుపు తిరిగేసరికి ఆమె ఒక్కర్తే నడిచివెడుతోంది. ఒకచిన్నకారు ఎదురుకావడం, అందులోని లావాటిమనిషితోకలిసి ఆమె అదృశ్యంకావడం నాకు స్వయంచూచిన కామేశం చెప్పాడు. ఆమె సీటులోకి రాగానే శ్రీశ్రీ ఓబయ్యగారూ! మీరు చక్కని సంఘప్రణాలికలు రెండుమూడు తయారుచేసి, నాకు అనువైన సలహాలనిస్తూ మన సంఘాభ్యుదయానికి తోడ్పడాలి...మిగిలినవారూ నాకు సహకరించాలి...అన్నది. ఓబయ్య ఒకటికి రెండయాడు. ఇంతదాకా ఆమె శ్రీమతికాదన్నవాడు "శ్రీమతీ! మన సమావేశాలు దిగ్విజయంగా నెగ్గాలి అంటే పక్షపాతం అనేదాన్ని బైటికి సాగతోలాలి. మీరు సభ్యులను పక్షపాతరహితంగా చూచిననాడు మనచర్చలు సాగుతాయి. నిజాన్నే తీర్మానిస్తాయి" అని గబగబా అనేశాడు.

సంగయ్యకీదృశ్యం ఏమనిపించిందో "సోదరులారా! ఆంధ్రరాష్ట్రబిల్లుచర్చ ఎలాజరిగిందీ విన్నారుగదూ! మన ఆంధ్రుల ఐకమత్యమెలాటిదో మరొకసారి రుజువయింది. నాయకులనబడేవారు ఎంతటి బాధ్యతలతో ప్రవర్తించారో కూడా ప్రజలకు బోధపడింది. రాజధాని నిర్ణయాన్ని గురించి జరిగిన రభస తారస్థాయిని పడింది. ఆయనెవరో నాడీగ్రంథాన్నిబట్టి చెప్పినట్టు జనవరికిగాని రాష్ట్రం అవతరించక పోవడమో... లేక అస్తవ్యస్తంగా ఆ కర్నూలునుండే మనము పాలింపబడడమో జరుగుతుంది. ఆంధ్రశాసనసభ్యుల అయోమయస్థితి అంతర్జాతీయ రాజకీయ నిపుణులైన నెహ్రూగారి దృష్టిలో ఏరీతి సమన్వయాన్ని పొంది, ఎట్టి యాజ్ఞలను వెలువరించునో వేచిచూడాలి. వావిలాలవారి తీర్మానం చచ్చిందో బ్రతికిందో తెలియడానికి రక్తం పరీక్షకు పంపారు... ఫలితం ఊహ్యం. కర్తవ్యం మృగ్యం...అంటూ సంగయ్య చెప్పదలచిందేదో చెప్పకుండానే వెంగయ్య అందుకుని... అదే నేను ప్రారంభంలో ఉపక్రమించింది. శాసనసభలో పార్టీని బ్రతికించుకోడానికి ప్రభుత్వపక్షాన్ని నెగ్గించుకోడానికి ఎలాటి పద్ధతులనాధారం చేసుకోవలసివచ్చిందో మనం గుర్తుంచుకోవాలి. తుదకు నూతనవిద్యాప్రణాలికసంగతి చూడండి. జూలై వెళ్ళిపోయింది. 35 వేల పాఠశాలల్లో ప్రవేశపెట్టబడిన ఈ ప్రణాలికను ఎన్ని పాఠశాలలు క్రియారూపంలో పెట్టాయో రాజాజీకి తెలుసునా? అసలు దీన్ని ప్రారంభించడమెలాగో ఉపాధ్యాయులకు చెప్పడం జరిగిందా? లేక-ప్రభుత్వంవారి తాఖీదులకు సమాధానాలు (జరిగిన జరగకపోయినా)పంపే అలవాటులోనే "ఈ ప్రణాలిక ప్రారంభింపబడింది" అని ఉపా-

ధ్యాయులు వ్రాయడం జరిగిందా? ఎనిమిదేళ్ళ కుర్రవాడికి మట్టి పిసకడం కుండలు చేయడం నేర్పడమెందుకండి? నాకు పైకి చదివించుకొనే మార్గం మూయించివేయాలనా? అంతమార్గం లేనప్పుడు రెండువారాలలో నా కొడుకు నా కుల వృత్తిని అనుసరించలేడా? లేక యీ ప్రణాలిక కర్థం ఇతరకులాలవారికికూడా కుండలుచేయడం క్షురకర్మచేయడం నేర్పించాలనా రాజాజీగారి అభిప్రాయం? కాలేజీలలో మార్పిడిచేయవలసిన సంస్కారవిధిని ప్రాథమిక పాఠశాలల నెత్తిని రుద్దడంలో అర్థం ఏమిటి? అని కుమ్మరి గురవయ్య పబ్లిక్‌గా సవాలు చేస్తున్నాడు. దీనికేమంటుంది ప్రభుత్వం? అసలే ఆ ప్రాథమిక పాఠశాలలలో అక్షరాలంటే మార్గం నశించింది. మూడురోజులకే ట్రాన్స్‌ఫర్లు మాస్టర్లకి. బాధ్యత అనేది ప్రాథమికోపాధ్యాయునికి లేదు. అతన్ని బాధ్యత అల్లా కాలంగడపడము, రికార్డుషీట్సు పూర్తిచేయడం' ఇనస్పెక్టరులకు కొబ్బరికాయలతో దక్షిణద్రవ్యాలతో తృప్తిపరచడం... బిల్లులు పంపడం... అలాటీ బాధ్యతలేనివానికి పవిత్రమైన కులవృత్తులు నేర్పే పనిని అకాలంలో అంటకట్టడం అన్యాయమే. మద్యనిషేధ కార్యక్రమమెంత జయప్రదమయిందో ఈప్రణాలిక అంతే జయప్రదమౌతుంది. రాజాజీగారికి విద్యామంత్రిగారు వంతపాడడం వింతగానే ఉంది. అందరు సభ్యులతోనూ సంప్రదించే యీ ప్రణాళికను ప్రవేశపెట్టాం అనే నినాదంలోనే ఉంది ఏమి ధ్వనిఉన్నా. విద్యాశాఖాధికారుల ప్రణాళిక సమర్థనోపన్యాసాలువిన్న ఉపాధ్యాయులే "ప్రణాలికను ప్రశంసించడం వినబడిందేగాని, అమలు జరపవలసిన సులభోపాయాలు ధ్వనించలేదు"అని పరితాపపడుతున్నారు. మనవూరు పెరుమాళ్ళ మాస్టరు కొందరు పిల్లల్ని వడ్రంగం నేర్పిద్దామని భంభంగారి దగ్గరకు (అసలు పేరు సాంబంలెండి సౌకర్యోచ్చారణ కోసం భంభం అంటారు మిత్రులు) పట్టుకెడితే... బాబూ! నాగళ్లు చెక్కుకొనేరోజులు తరవాతరండి. మీపిల్లలకి పని నేర్పితే జీతం కాజేసేది మీరు. మాకేమొస్తుంది... వెళ్ళండి వెళ్లండన్నాడట. విన్నారా? అసలు పెరుమాళ్లు అంటేనే తప్పించుకు తిరిగే ధన్యుడు. ఇది అదునుచూచుకొని క్లాసుకు సెలవిచ్చి రైలెక్కాడు. రైళ్ళెక్కి షికార్లు కొట్టడం వాడికి పరిపాటి అని మీకు తెలుసుగా...ఇక ప్రాథమికవిద్య అంటూండగా...మరి యొకరికి అవకాశం ఇయ్యండి అని నాంచారమ్మ హోదాలో హెచ్చరించారు.

కొరియా యుద్ధ విరమణకు 23 లక్షల జనం నాశనంకావడంతో మార్గం దొరికింది. మన కాశ్మీరు పాకిస్తాన్ సమస్యలు ఎంత జనంతో తేలతాయో మన సంఘం అంచనా కట్టడం యుక్తం అన్నాడు కామేశం. కాశ్మీరు సమస్యకు కేవలం అశోక వీరచక్రాల ఖర్చేగాని మన ప్రభుత్వానికి అదనపుఖర్చు లేదటగా అన్నారు వైద్యరాజు. పాకిస్తానుతో సంప్రదింపులు సఫలమైతే అది చాలదా ప్రస్తుతానికి అన్నాడేదో ధోరణిలో ఓబయ్య. మామిడిపళ్ళ బుట్టలు....కానుకల హడావిడి...వినోద యాత్రలు...అంతే కాని నెహ్రూజీ సరిహద్దు గాంధీని దర్శించిన జాడ లేదు...అంటూ నిట్టూర్చాడు బావ.

ఆయా నియోజకవర్గాలతో ఆయా శాసన సభ్యులు తగినంత సన్నిహితత్వం ఉంచుకోవాలని హైదరాబాదు కాంగ్రెసువారు ఆదేశించారట...మనకూ అలాటి ఆజ్ఞ ఉంటే బాగుండును! వేదనగా అన్నారు వైద్యరాజు.

మన ఆంధ్రకాంగ్రెసు చెప్పనే అక్కరలేదు. అసలు కాంగ్రెసు అధ్యక్షులకే ప్రజతో బంధనములేదు. శక్రటరీగారు వారికి తోకలా వెంబడే ఉండాలికదా! శాసనసభ్యులు ఎన్నికల రోజులలో మనకు సన్నిహితంగానే ఉంటూ వచ్చారుగా...వరుసగా శాసనసభకే హాజరుగాని సభ్యుల విషయం విచారించే నాథుడేలేదు. ఒక సభ్యునికి అస్వస్థత; ఒక సభ్యునికి తీరనిపనులు... ఇక ఆ నియోజకవర్గం ఆ సభ్యునితో బావుకునేదేముంటుంది? అట్టివాడు రాజీనామా యివ్వడు... కాళహస్తి నియోజకవర్గంలో సంజీవరెడ్డిగారిని గెలిపించడానికి వడ్రంగం ప్రారంభమయింది. కాన్పు విషయం ఎంతచేసినా అనుమానమే! మంత్రసానుల కేసులతో మైలపడిన ఆంధ్ర కాంగ్రెసు సంస్థ...రాళ్ళపల్లి వారిచేతిలో జాతక చక్రం చదివించుకోడంమంచిదేమో...ఆగాడు బావ... నాంచారమ్మగారు సమావేశాన్ని కాలనిర్ణయం లేకుండా వాయిదా వేశారు-లేచిపోయాం.